సమన్వయ లోపమే శాపమై..


గ్రీన్‌బెల్ట్‌లో వదిలేసిన సిమెంట్ పైపులు


ప్రమాదభరితంగా ఉన్న మంచినీటి వాల్వ్

- అభివృద్ధికి నోచుకోని గ్రీన్‌బెల్ట్
- వాకర్స్ పార్క్ నిర్మాణంలో జాప్యం
- స్పందించని అధికారులు

కంచరపాలెం: వివిధ శాఖల మధ్య సమన్వయలోపమే శాపమై జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి రెడ్డికంచరపాలెం నుంచి ఊర్వశి కూడలికి వెళ్లే జాతీయ రహదారి సబ్‌వే గ్రీన్‌బెల్ట్‌లు అభివృద్ధికి దూరమయ్యాయి. జీవీఎంసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రీన్‌బెల్టుల్లో ఏర్పాటు చేస్తున్న వాకర్స్ పార్కుల నిర్మాణం ఇక్కడ మాత్రం అంతంత మాత్రంగానే జరుగుతోంది. నీటిసరఫరా విభాగం అధికారులు, ఈపీడీసీఎల్ అధికారులు చొరవ చూపి, ఆటంకాలు తొలగిస్తేనే గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం మళ్లీ పరిఢవిల్లుతుంది. వాకర్స్ పార్కు నిర్మాణం సాధ్యమవుతుంది.

అడ్డుగా సిమెంట్ పైపులు, ట్రాన్స్‌ఫార్మర్లు

దుర్గానగర్, వివేకానంద వీధి, శ్రీనగర్, దేవేంద్రనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న వాకర్స్ పార్కులకు జీవీఎంసీ మంచినీటి పైపులు అడ్డుగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో ఏపీఈపీడీసీఎల్ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మంచినీటి పైపుల కోసం ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ అస్తవ్యస్తంగా ఉన్నాయి. గతంలో పనులు చేసి, మిగిలిన సిమెంట్ పైపులను నిర్లక్ష్యంగా వదిలేశారని స్థానికులు, వాకర్స్ ఆరోపిస్తున్నారు. పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండడంతో అటుగా ప్రయాణించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పైపులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో గ్రీన్‌బెల్ట్‌లో మొక్కల జాడ కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు. చాలాప్రాంతాల్లో వాకర్స్ పార్కుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నా ఇక్కడ వాటి జాడే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నాయకుల దృష్టికి, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆటంకాలు తొలగించి, వాకర్స్‌పార్కు నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చదనం కనుమరుగు

గ్రీన్‌బెల్ట్‌లో మంచినీటి సిమెంట్ పైపులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో పచ్చదనం కనుమరుగైంది. అన్ని ప్రాంతాల్లో వాకర్స్ పార్కుల నిర్మాణాలు జరుగుతున్నాయి, ఇక్కడ మాత్రం అలాగే ఉంది. అధికారులు చొరవ చూపాలి.

– శివప్రసాద్, రెడ్డి కంచరపాలెం

చర్యలు చేపడతాం



జోన్–5 పరిధిలో వాకర్స్ పార్కుల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే 80శాతం నిర్మాణాలు జరిగాయి. కొన్నిచోట్ల ఇబ్బందికర పరిస్థితుల వల్ల జాప్యం జరుగుతోంది. ఇక్కడి సమస్య మా దృష్టికి వచ్చింది. ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపడతాం.

– ఆర్.జి.వి.కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్–5

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన

మద్రిపాలెం: మురళీనగర్‌లోని రోడ్డు విస్తరణ పనులను 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. వార్డులో నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఏవిఎన్ రాజు, ఇన్‌చార్జ్ ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ ఆయన వెంట ఉన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఎఫ్‌సీఐ 11కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శివనగర్, ఎఫ్‌సీఐ పార్కు, భాస్కర్ గార్డెన్స్ రామాలయం వీధి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ ఏపీ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన పోటీల్లో 6 నుంచి 9తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మజీ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, అఫ్సర్ ఖాన్, డ్రాయింగ్ టీచర్ భవానీ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.9.74 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయ సముదాయంలోని హుండీల ఆదాయాన్ని మంగళవా రం లెక్కించారు. ఆలయ పర్యవేక్షణాధికారి పి.ఎల్.ఎన్.రాజు సమక్షంలో 137 రోజులకు సంబంధించిన ఆదాయాన్ని శ్రీహరి సేవకులు లెక్కించగా 9 లక్షల 74 వేల 144 రూపాయలు వచ్చాయని ఈవో శేఖర్‌బాబు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

షాలిమార్–వాస్కోడగామా రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : షాలిమార్‌లో మంగళవారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్– వాస్కోడగామా(18047) ఎక్స్‌ప్రెస్ సుమారు మూడు గంటలు ఆలస్యంగా బుధవారం తెల్లవారు 2.05 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకోనుంది.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు రమేష్, మేనేజర్ కృష్ణసేన్

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్టు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ తెలిపారు. మంగళవారం పీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా అష్టలక్ష్మీ యాగంతో పాటు అష్టలక్ష్మీ వైభవం కూడా నిర్వహిస్తామన్నారు. అష్టలక్ష్మీ వైభవంలో మహాలక్ష్మి అమ్మవారితో పాటు ఎనిమిది రూపాల్లో అష్టలక్ష్ములను స్థాపన చేసి రోజూ ఉదయం దేవతలకు హోమం, స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహిస్తామని తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పీఠంలో అష్టలక్ష్మి కల్యాణం జరుగుతుందన్నారు. ఎక్కడైనా లక్ష్మీ నారాయణుల కల్యాణం జరిపిస్తుంటారని, కానీ లలితా పీఠంలో మాత్రం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ఏకకాలంలో కల్యాణం జరిపించడం విశేషమని పేర్కొన్నారు. అధిక మాసంలో చేసే పూజలకు అధిక ఫలితం లభిస్తుందని శ్రీమహావిష్ణువు సాక్ష్యాత్తు లక్ష్మీదేవికి చెప్పినట్టు పురాణాల్లో ఉందన్నారు. అనంతరం యాగం వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, సన్యాసిరావు పాల్గొన్నారు.

దిగివచ్చిన టమాటా ధరలు


నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయానికి ఉంచిన టమాటా

సీతంపేట: సుమారు నెలరోజులు పాటు ఆకాశాన్నంటిన టమాటా ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఒక రకం టమాటా కిలో రూ.84, చిన్న రకం టమాటా కిలో రూ. 60లకు విక్రయించారు. గత నెలలో రైతు బజార్‌లో కిలో రూ.130కి, బహిరంగ మార్కెట్‌లో కిలో 200 వరకు ధర పలికింది. పెరిగిన ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. ధరల నియంత్రణకు ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి టమాటాలు సేకరించి సబ్సిడీ ధరపై కిలో రూ.50 చొప్పున విక్రయాలు చేపట్టింది. దీంతో కొంతవరకు ధరలు అదుపులోకి రాగా, ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్‌కు టమాటా సరుకు పెద్దఎత్తున రావడంతో ఒకేసారి ధర తగ్గుముఖం పట్టింది. ధర ఒకేసారి తగ్గడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. బజారుకు 70 క్రేట్ల టమాటా రావడంతో జోరుగా విక్రయాలు జరిగాయి. మరో వారం రోజుల్లో క్రమేణా ధర తగ్గే అవకాశం ఉందని బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పంపిణీ చేశారు. మూడు కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, రెండు కిలోల రాగి పిండి, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, కిలో కందిపప్పు, కిలో అటుకులు, అర లీటర్ వంటనూనె, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చక్కీ, పావు కిలో ఖర్జూరంతో కూడిన కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాలు లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న పోషణ కిట్లు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దేముడుబాబు, వైద్యాధికారి సత్యకార్తీక్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ కుమారి, సచివాలయం మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపు అవసరం


రిసోర్స్ పర్సన్స్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో ఆ సంస్థకు సంబంధించిన వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. రూబికన్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, విభాగ ఆచార్యులు ఎస్.సాంబశివరావు, ప్రభాకర్, బి.సుబ్బయ్య, రంజిత్, సెరన్స్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం విద్యార్థులకు దిశానిర్దేశం


జర్నలిజం విభాగ విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను పలు ఉదాహరణలతో వివరించారు. జర్నలిజం కోర్సును పూర్తిచేసే సమయానికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం విభాగం నుంచి నూతన స్టార్టప్ సంస్థలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ నుంచి ప్రచురితమవుతున్న వార సంచిక ఏయూ లుక్స్ తీర్చిదిద్దడంలో యువత తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తూ ఏయూ లుక్స్ విస్తరణలో భాగం కావాలని ఆహ్వానించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. ఏయూ లుక్స్ సంచిక వేలాది మందికి చేరువవుతోందని, రానున్న కాలంలో మరిన్ని మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతోనే సామాజిక మార్పు


శిక్షణ పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక అభివృద్ధికి దోహదకారిగా అధ్యాపకులు నిలవాలన్నారు. వైవిధ్యమైన జ్ఞానాన్ని కళాశాలలో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థిలోని లోపాలను ఎత్తి చూపకుండా, వారిని సరిదిద్ది తగిన మార్గదర్శకం అందించేలా ఉండాలని సూచించారు. భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

మెరిట్ ఉన్న వారికే ఉద్యోగాలు

- బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు
- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : ఇటీవల విశాఖ ఉమ్మడి జిల్లా పరిధిలో నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసి వారికి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సు, ఏఎన్‌ఎంలతోపాటు ఏ కేడర్ ఉద్యోగాలు అయినా సంబంధిత కోర్సుల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. మరే ఇతర మార్గాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లేదని, అందువల్ల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పి డబ్బులు వసూలు చేసేవారి పట్ల అప్రమతంగా ఉండాలని కోరారు.

వైభవుని ఆలయంలో 13న వ్యాసరచన పోటీలు

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వివిధ అంశాలపై ఈ నెల 13వ తేదీన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు తెలిపారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, స్వాతంత్ర్యోద్యమ కాలంలో సమరయోధుల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. పది సంవత్సరాల వయసు దాటిన ప్రతీ భక్తుడు ఆరోజు ఉదయం 9గంటలకు నిర్వహించే వ్యాసరచన పోటీల్లో పాల్గొనవచ్చని తెలియజేశారు. ఆలయ కార్యాలయానికి నేరుగా వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆగస్టు 15న ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలియజేశారు.

రోడ్డెక్కని '69' సిటీ బస్సులు

ఆరిలోవ: రైల్వే స్టేషన్ నుంచి ఆరిలోవ కాలనీకి తిరిగే సిటీ బస్సులు కొద్ది రోజులుగా రోడ్డెక్కడం లేదు. ఆర్టీసీ అధికారులు నాలుగు నెలల క్రితం పలు బస్సులను నిలిపేయగా, సుమారు నెల రోజులుగా మిగతా అన్ని బస్సు సర్వీసులను ఆపేశారు. ఆరిలోవ కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు సిటీ బస్సులు నడుపుతున్నారు. ఆరిలోవ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్‌కు, రైల్వే స్టేషన్‌కు పదుల సంఖ్యలో సర్వీసులు ఉండేవి. వాల్తేరు డిపో నుంచి '60సి'నంబరు బస్సులు ఆరిలోవ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్‌కు, మద్దిలపాలెం డిపో నుంచి '69'నంబరు గల బస్సులు ఆరిలోవ కాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు ఆరు బస్సులను ప్రతి 20 నిమిషాలు, అరగంట వ్యవధిలో నడిపేవారు. ఇప్పుడు 69 నంబరు బస్సులను పూర్తిగా ఆపేశారు. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ఆటోలు, ట్యాక్సీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నంబరు గల సిటీ బస్సులు ఆరిలోవ నుంచి వెంకోజీపాలెం, ఇసుకతోట మీదుగా హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, సీతమ్మధార రైతుబజార్, సత్యం జంక్షన్, గురుద్వార, ఆర్టీసీ కాంప్లెక్స్, డాబా గార్డెన్స్ కూడలి మీదుగా అల్లిపురం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్తుండేవి. ఇప్పుడు అటుగా వెళ్లాల్సిన వారంతా ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి 69 సిటీ బస్సులను యథావిధిగా పునరుద్ధరించాలని ఆరిలోవ వాసులు కోరుతున్నారు.

రాహుల్‌పాల్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి నిట్ల రాహుల్‌పాల్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎస్.పల్లంశెట్టి పర్యవేక్షణలో ‹ఎ ఫ్రేం వర్క్ టు ది పెరఫార్మెన్స్ ఆఫ్ సిక్స్‌లో డబల్యూ పాన్ ఫర్ ఐవోటీ యూజింగ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నిక్స్›అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు డాక్టరేట్ ఉత్తర్వులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి రాహుల్‌పాల్ స్వీకరించారు. ఈ సందర్భంగా రాహుల్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

విచారణ పేరుతో బాలల నిర్బంధం తగదు


సీఐ శ్రీనివాసరావుతో చర్చిస్తున్న రాష్ట్ర బాలల కమిషన్ సభ్యులు గొండు సీతారాం

సీతమ్మధార: బాలలను వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకుని విచారణ పేరిట రోజుల తరబడి అరెస్ట్ చూపకుండా పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం తగదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఓ కేసులో ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చూపకుండా రోజులు తరబడి వారిని కస్టడీలో ఉంచుకున్నట్లు సమాచారంతో సుమోటాగా తీసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం మంగళవారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వెంకటరావుతో కలిసి స్టేషన్‌ను పరిశీలించారు. ఏడుగురు నిందితుల్లో ఉన్న ఐదుగురు బాలలతో మాట్లాడారు. ఏ కేసులో ఎన్ని రోజుల క్రితం స్టేషన్‌కు తీసుకువచ్చారు.. పోలీసులు బెదిరింపులకు పాలపడ్డారా? లాఠీచార్జి చేశారా? అని సీతారాం ఆరా తీశారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. తక్షణమే వారిని జేజేబీ కోర్టు ముందు హాజరుపరిచి నివేదికను కమిషన్‌కు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ, డీపీవో శరత్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, పీవో ఐసీ మమత, లీగల్ కం ప్రొబేషన్ అధికారి అనీజ, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి శారదా, బి.శకుంతల, పి.శేఖర్, లవకుశ, హరీష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఐదుగురిని జువైనైల్ హోంకి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

అలరించిన సంగీత విభావరి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, గాయనీగాయకులు

సీతంపేట: శివసాయి సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు వి.ఎం.గోపాలరావు, ప్రముఖ వ్యాఖ్యాత రాజేంద్రప్రసాద్, సంఘ సేవకులు రమణమూర్తి గాయనీ గాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పల్లెకు పోదాం పారును చూద్దాం పేరిట నిర్వహించిన విభావరిలో గాయనీగాయకులు శివసాయి గోపాలరావు, వి.బంగార్రాజు, మహ్మద్ ఖాన్, బొమ్మిడి సత్యనారాయణ, విజయ్‌కుమార్, గోపాలరావు, శ్యామ్ సుందర్, పి.రాము, ఎం.కనకారావు, నాగు, మహదేవమూర్తి , రాధ, లక్ష్మి, సాత్విక, వాసంతి, శ్వేత, మాధురి, జాస్మిన్ తదితరులు ట్రాక్స్‌పై గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ


జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో రగ్గులు అందిస్తున్న ధర్మాల

కంచరపాలెం: డీఎల్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ధర్మాల ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా కప్పరాడ, కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రగ్గులు, అల్పాహారం అందజేశారు. ఆనంద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ డీఎల్ రెడ్డి కార్మిక నాయకుడిగా కార్మిక రంగంలోనూ, రక్షణ రంగంలో అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణకాంత్‌రెడ్డి, జానకిరామ్, నూకరాజు, కుమార్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్న వినాయక ఆలయ వార్షికోత్సవం


వినాయకుడికి పూజలు చేస్తున్న ఏఎస్‌ఐ తదితరులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం జాషువానగర్‌లోని ప్రసన్న వినాయక ఆలయ 25వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వరహా గిరిశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఆదిరాజు, రాజు సప్లయర్స్ అధినేత కె.ఎస్.ఎన్.రాజు, దళిత నాయకురాలు ఈతలపాక సుజాత పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపించా రు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జాషువా కళాప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మిడి అచ్చిబాబు, కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో మంగళవారం దాడి చేశారు. అక్కయ్యపాలెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పలువురు పేకాట ఆడుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50,200తో పాటు ఎనిమిది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.